క్లుప్తంగా

అలరించిన కోలాట ప్రదర్శన



శ్రీలలితా పీఠంలో కోలాటం ప్రదర్శించిన యోగ చైతన్య బృందం

సీతంపేట : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో యోగ చైతన్య కోలాట బృందం (శంకరమఠం) చేసిన కోలాట ప్రదర్శన అలరించింది. శ్రీభూ నీలా సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఉత్సవమూర్తుల ఎదుట బృంద సభ్యులు హరినామ సంకీర్తనలకు కోలాటంతో నీరాజనం అర్పించారు. బృంద నాయకురాలు కె.పద్మజ ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన జరిగింది. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ వీరిని సత్కరించారు. అమావాస్య సందర్భంగా సోమవారం ఉదయం 9 : 30 గంటలకు అధర్వణ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తామని కృష్ణసేన్ తెలిపారు.

నందగిరినగర్‌లో ఉచిత వైద్య శిబిరం



పరీక్షిస్తున్న డాక్టర్ రమేష్

సీతంపేట : జీవీఎంసీ 44వ వార్డు నందగిరినగర్ సేవా సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ ఎండీ డాక్టర్ కాండ్రేగుల రామ్‌కుమార్ సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ నెల మొదటి ఆదివారం నందగిరినగర్‌లో ఉచితంగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని, 2024 సంవత్సరం చివరి ఆదివారం కావడంతో శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 150 మందికి జనరల్ పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, నర్సింగ్ స్టాఫ్ సుజాత, సిబ్బంది దినేష్, నందగిరినగర్ సేవా సంఘం అధ్యక్షుడు జయకుమార్, ఉపాధ్యక్షుడు వెంకన్న, కార్యదర్శి గౌరీశంకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులోని శ్రీ మహా గణపతి, ప్రసన్న వేంకటేశ్వర, శ్రీ అయ్యప్ప, శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు నిర్వహిస్తున్నారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో జనవరి 13 వరకు రోజూ ఉదయం శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన నిర్వహిస్తున్నట్లు అర్చకులు రాజాస్వామి తెలిపారు. ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. జనవరి 10న శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా 'ఉత్తర ద్వార దర్శనం' ఉదయం 5 గంటల నుంచి కల్పిస్తామని తెలిపారు. 13న ఉదయం గోదాదేవి, రంగనాథుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, కల్యాణంలో పాల్గొనదలిచే భక్తులు రూ.350 చెల్లించాలని నిర్వాహకులు తెలిపారు.

సమస్తం ప్లాస్టిక్‌మయం

- నగరంలో అమలుకాని నిషేధం
- నామమాత్రంగా అధికారుల దాడులు
- పట్టించుకోని జీవీఎంసీ జోన్ – 3 అధికారులు



రైతుబజార్‌లో ప్లాస్టిక్ కవర్లలో కూరగాయలు తీసుకెళ్తున్న వినియోగదారులు

సీతమ్మధార : అందుబాటులో ఉంటుందన్న నెపంతో భవిష్యత్‌లో జరగబోయే అనర్థాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. 40 మైక్రాన్ల లోపు పాలిథిన్ కవర్ల వినియోగం షరా మామూలుగా అలవాటైపోయింది. జీవీఎంసీ అధికారులకు గుర్తొచ్చినప్పుడు అదపాదడపా తనిఖీలు... నాలుగైదు రోజులు రైతుబజార్లలో హడావిడి... యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు.. అంతే తప్ప పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం వట్టిమాటే అంటే అతిశయోక్తి కాదు. మళ్లీ ఇప్పుడేమో జీవీఎంసీ అధికారులు వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి పూర్తి స్థాయిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. నగరంలో పాలిథిన్ కవర్ల నిషేధం ఆటకెక్కింది అంటే అతిశయోక్తి కాదు. వ్యాపారులు విక్రయిస్తున్న కవర్లన్నీ 40 మైక్రాన్లు మందం లేవన్నది జగమెరిగిన సత్యమే. నిషేధం గుర్తొచ్చినప్పుడు అధికారులు చిరు వ్యాపారుల మీద తమ ప్రతాపం చూపి, జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తున్నారు తప్ప నిబంధనలు కచ్చితంగా అమలు చేయడానికి మాత్రం ముందుకు రావడం లేదు. అధికారులు హెచ్చరించినప్పుడు, దాడులు చేస్తారన్న కొద్దిపాటి భయంతో వారం, పది రోజులపాటు వ్యాపారులు కవర్లలో సరకులు ఇవ్వడం మానేస్తున్నారు. వారు వస్తున్నారని తెలియగానే వార్తా పత్రికలతో విక్రయాలు చేయడం, తర్వాత మళ్లీ షరా మామూలే. నగరంలో కాలుష్యం తగ్గాలంటే ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించక తప్పదని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. పలుచోట్ల చెత్తకు నిప్పు పెట్టినపుడు అందులోని ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా కాలిపోయి పర్యావరణానికి తీరని హాని కలుగుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది.

గుట్టలుగా పేరుకుపోతున్న వ్యర్థాలు



ప్లాస్టిక్ కవర్లలో కూరగాయలు తీసుకెళుతున్న వినియోగదారులు

వాడి పడేసిన పాలిథిన్ కవర్లు ఎక్కడికక్కడ గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మట్టిలో, నీళ్లలో, కొండల్లో, గుట్టల్లో, చివరకు కాలువలు, గెడ్డల్లో పాలిథిన్ వ్యర్థాలు పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. చెత్త కుండీల్లో, ఆట మైదానాల్లో, బీచ్, మురుగు కాలువల్లో, ఖాళీ స్థలాల్లో.. ఇలా ఎక్కడ చూసినా పాలిథిన్ కవర్లే కనిపిస్తున్నాయి. కనీసం ఇవి రీ సైక్లింగ్‌కు కూడా ఉపయోగపడవు. అతి పలుచగా ఉన్న పాలిథిన్ కవర్లను గుర్తించని పశువులు తింటూ చనిపోతున్న సందర్భాలు చాలా ఉన్నాయి.

అనర్థాలు అన్నీ ఇన్నీ కావు..

పాలిథిన్ కవర్లు మట్టిలో కలవడానికి సుమారు వెయ్యి సంవత్సరాలు పడుతుందని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చెబుతున్నారు. మట్టికి మనిషికి మధ్య అడ్డుగోడలా పాలిథిన్ నిలుస్తోందని ఆందోళన చెందుతున్నారు. నగరంలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తరలించే ఓపిక లేక పారిశుధ్య సిబ్బంది కాల్చేస్తున్నారు. ఆ మంటల్లో నుంచి విష వాయివులు పుట్టుకొస్తున్నాయి. ఫలితంగా క్యాన్సర్, మూత్రపిండాల సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు, చర్మ సమస్యలు వస్తున్నాయి.

ప్రజల్లో మార్పుతోనే సాధ్యం..

పర్యావరణ ఉపయుక్తమైన సంచులు తప్ప పాలిథిన్ సంచులు వాడకూడదన్న ఆలోచన ప్రజల మనస్సులో నుంచి వస్తే తప్ప ఈ సమస్యను అధిగమించలేం. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. అందరూ కలిసి రాకపోతే పాలిథిన్ రక్కసి మనల్ని మింగేయడం ఖాయం. మరోవైపు 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న హోల్‌సేల్ వ్యాపారులపై చర్యలు తీసుకుంటే వినియోగం సమస్య వుండదు కదా అని పలువురు సూచిస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పూర్తిస్థాయిలో అమలు చేయలేని అధికారులు ఇప్పుడు జనవరి ఒకటి నుంచి పూర్తి స్థాయిలో నిషేధం ఎలా అమలు చేస్తారని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.

నిషేధం ఉల్లంఘిస్తే జరిమానా

తక్కువ మైక్రాన్స్ ఉన్న పాలిథిన్ కవర్లను వాడుతూ పట్టుబడితే జరిమానా విధిస్తున్నాం. పాలిథిన్ కవర్ల వినియోగంపై నిషేధం విధించామని ఎప్పటికప్పుడు ప్రచారం చేస్తున్నాం. కిరాణా దుకాణాలు, షాపింగ్ మాల్స్, రైతుబజార్లలో నిరంతరం తనిఖీలు చేస్తాం.

– కె.శివప్రసాద్, జోనల్ కమిషనర్, జీవీఎంసీ జోన్ – 3, ఆశీలమెట్ట

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి



పోక్సో చట్టంపై అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

తాటిచెట్లపాలెం : విద్యార్థుల అభ్యున్నతికి, క్రమశిక్షణతో కూడిన జీవనానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధుల కృషి అవసరమని, కెప్టెన్స్ పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కోరారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖపట్నం, అల్లూరి జిల్లాల ఉపాధ్యాయ ప్రతినిధులకు గత కొద్ది రోజులుగా ఈస్ట్ కోస్ట్ క్యాంపింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న బేసిక్ కోర్స్ ఫర్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మాస్టర్స్ శిబిరంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షమానికి ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయిస్తున్నా, నిత్యం బాలల హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని, ఇది ప్రమాదకరమన్నారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ సారథ్యంలో పోక్సో చట్టంపై రూపొందించిన గోడ పత్రిక ఆవిష్కరించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ అడల్ట్ రిసోర్స్ కమిషనర్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావోత్సవాలు వచ్చే ఏడాది విశాఖలో నిర్వహించేలా ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి దాసరి వేణుగోపాల్, జిల్లా ట్రైనింగ్ కమిషనర్ ఎ.స్వామినాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ మారుతి హరీష్‌కుమార్, ఎస్వీ రమణ, సీహెచ్ దేశాయ్, పి.కిషన్‌కుమార్, కేబీఆర్‌పీ శర్మ, సీహెచ్‌ఎల్ కామేశ్వరి, ఆర్.ధనలక్ష్మి, అహ్మద్ షరీఫ్, సీహెచ్ చిన్నమ్మలు, జి.జానకీరాం, ఉషారాణి, నజమా బేగం పాల్గొన్నారు.

కళాకారులు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలి



ఫ్రాన్సిస్ దంపతులను సత్కరిస్తున్న పల్లి నల్లనయ్య, రమణమూర్తి తదితరులు

సీతంపేట : కళాకారులు అన్ని రంగాలలో ప్రావీణ్యం సాధించాలని, నటులు, దర్శకులు, ప్రయోక్త, రచయిత పాలమరశెట్టి ఫ్రాన్సిస్ ఆ కోవకు చెందిన వ్యక్తే అని విజయనగరం మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్, పిల్లుట్ల ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ నేవీ విశ్రాంత అడ్మిన్ ఆఫీసర్ పిల్లుట్ల శ్రీశైల మల్లికార్జున శర్మ 86వ జయంతి వేడుకలు ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధ్యక్షోపన్యాసం చేస్తూ కళారంగానికి ఫ్రాన్సిస్ ఎనలేని సేవ చేశారని కొనియాడారు. కళాకారులు అతడిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాలమరశెట్టి ఫ్రాన్సిస్ దంపతులను అతిథుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ కార్యదర్శి పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ మాట్లాడుతూ సంస్థ ద్వారా గత 25 ఏళ్లలో ఎంతో మంది కళాకారులను సత్కరించామని, ఈ రోజు సంస్థ ద్వారా ఫ్రాన్సిస్ దంపతులను సత్కరించే అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విశాఖ పోర్టు సీఏవో దేవర రమణమూర్తి, శ్రీమాత అధినేత పల్లి నాగభూషణరావు, న్యాయవాది ఉమా సావిత్రి, జానపద గాయకుడు కె.ఆది, పిల్లుట్ల ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు పిల్లుట్ల గోపి, ఉత్తమ ఉపాధ్యాయుడు పి.నిర్మలరాజు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి ఆదరణ



మాట్లాడుతున్న రచయిత ఈతకోట సుబ్బారావు

సీతంపేట : సాఫ్ట్‌వేర్ రంగం వచ్చినా తెలుగు కథలకు, తెలుగు సాహిత్యానికి ఆదరణ తగ్గలేదని రచయిత ఈతకోట సుబ్బారావు అన్నారు. తటవర్తి భారతి స్మారక సాహిత్య సభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కథ, కథనం అంశంపై ప్రసంగించారు. తారు రోడ్డు రాకముందే కథలు ఇక్కడ పుట్టాయని, మహాకవి ఆరుద్ర అన్నట్టు తల్లి ఒడిలో నుంచే కథలు నేర్చుకుంటామని తెలిపారు. కరోనా, సోషల్ మీడియా పుణ్యమా అని ఒక రకంగా తెలుగు భాష బతికి బట్ట కట్టిందన్నారు. కథల్లో మానవీయ కోణం ఉండాలని, మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారుతున్న తరుణంలో కథల్లో కూడా మార్పు వచ్చిందన్నారు. తెలుగు సాహిత్యంలో ఎంతో మంది కథలు రాసే వారు ఉన్నారని, తెలుగు సాహిత్యానికి ఆదరణ తగ్గలేదన్నారు. ప్రముఖ రచయిత ఎం.సుగుణరావు మాట్లాడుతూ పాలకులు చేపట్టే విధానాల వల్ల రకరకాల సంస్కరణలు వచ్చాయని, ఫలితంగా కొన్ని కుల వృత్తులు దూరమయ్యాయని తెలిపారు. కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారి జీవనం ఏ విధంగా మారిందో తెలిపే కథలు వచ్చాయన్నారు. అలాగే గోద్రా అల్లర్లు తర్వాత వచ్చిన కథ, అమెరికన్ రచయిత జేమ్స్ రాసిన నవల గురించి వివరించారు. కథా పఠనం, రికార్డింగ్‌లో మెలకువలపై రాంబాబు కొప్పర్తి, పప్పు భోగారావు ప్రసంగించారు. విమర్శ, విశ్లేషణ, సమీక్ష అనే అంశాలపై సీహెచ్.సుశీలమ్మ, డి.వి.సూర్యారావు మాట్లాడారు. కథల పోటీలు, పత్రికాధిపతుల సలహాలు అంశంపై సంపాదకులు గొర్లి శ్రీనివాసరావు, శరత్ చంద్ర, శిరేల సన్యాసిరావు మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన కథల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

పలువురికి పురస్కారాలు

ఈ సందర్భంగా 14 మంది కవులు, రచయితలకు తటవర్తి భారతి సాహిత్య పురస్కారాలు అందజేశారు. దాట్ల దేవదానం రాజు, ఈతకోట సుబ్బారావు, ఎం.సుగుణరావు, సీహెచ్.సుశీలమ్మ, డి.వి. సూర్యారావు, రాంబాబు కొప్పర్తి, పప్పు భోగారావు, ఇందూ రమణ, గొర్లి శ్రీనివాసరావు, శరత్‌చంద్ర, శిరేల సన్యాసిరావు, తటవర్తి శంకరరావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, మేడా మస్తాన్ రెడ్డి పురస్కారాలు అందుకున్నారు.

రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్



రౌడీషీటర్లుకు కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు



రౌడీషీటర్లుకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

సీతమ్మధార : రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని, చట్టపరమైన చర్యలు తప్పవని, సత్ప్రవర్తనతో మెలగాలని ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ వి.శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలిముద్రలతో పాటు సంతకాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, ఎవరినైనా బెదిరించి డబ్బులు వసూలు చేసినా, గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు హద్దు మీరితే పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందని, రోజూ చేస్తున్న పనులను పర్యవేక్షిస్తుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మేంద్ర, ఏఎస్ఐ డి.వి.రత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

- రౌడీషీటర్లు సమాజంలో అల్లర్లు సృష్టించకుండా ప్రశాంతంగా జీవించాలని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లుకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి రోజువారీ కార్యకలాపాలపై ఆరా తీశారు. అల్లరు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

- కానరాని పారిశుధ్య సిబ్బంది
- పట్టించుకోని జోన్ – 3 ప్రజారోగ్యశాఖ



గురుద్వార్ వెనుక రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

సీతమ్మధార : జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది ఏ ఊరులో ఉన్నారో తెలియదుగానీ నియోజకవర్గంలోని చెత్తకుప్పలకు మాత్రం మోక్షం కలగడం లేదు. ఏ వీధిలోనూ పారిశుధ్యం మెరుగుపడడం లేదు. పైగా డంపర్‌బిన్లు నిండిపోయినా తరలించే నాథుడే కరువయ్యాడు. నియోజకవర్గంలోని 14, 24వ వార్డుల పరిధి నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, గురుద్వార్ వెనుక రోడ్డులో, గాంధీనగర్, టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, 27వ వార్డు రామాటాకీస్, శ్రీనగర్ ప్రాంతాలు కంపు కొడుతున్నా అధికారులకు మాత్రం చీమకుట్టినట్లయినా లేకపోవడం గమనార్హం. వర్షాలు కురవడంతో చెత్త కుళ్లిపోయి ఆయా వార్డుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు ఏం చేస్తున్నారో తెలియడం లేదని, పారిశుధ్యం మాత్రం మెరుగుపడడం లేదని స్థానికులు నిట్టూరుస్తున్నారు. రోడ్డుపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయని, ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని పాదచారులు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ జోన్ – 3 ప్రజారోగ్యశాఖ విభాగం అధికారులకు మాత్రం చెవికెక్కడం లేదని అంటున్నారు. సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్, బాలయ్య శాస్త్రి లేఅవుట్, రాధాకృష్ణ లే అవుట్ ప్రాంతాల్లోనూ పారిశుధ్యం ఘోరంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త పేరుకుపోవడంతో కుక్కలు, పశువులు చేరి చెల్లాచెదురు చేస్తున్నాయని, దోమలు కూడా వృద్ధి చెందడంతో మలేరియా జ్వరాలు సోకుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో జీవీఎంసీ జోన్ – 3 ప్రజారోగ్యశాఖ అధికారులు స్పందించి పారిశుధ్య సిబ్బందితో చెత్త తరలింపునకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రైతుబజార్‌లో చెత్త తొలగింపు



రైతుబజారులో చెత్త తొలగించి శుభ్రం చేసిన ప్రాంతం

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : స్థానిక సీతమ్మధార రైతుబజారులో పేరుకుపోయిన చెత్తను బజారు సిబ్బంది ఆదివారం తొలిగించారు. ఈ ప్రాంతం శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. 'రైతుబజారులో పేరుకుపోయిన చెత్త' శీర్షికతో సాక్షిలో ఆదివారం ప్రచురించిన వార్తకు రైతుబజారు ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది బజారులో పేరుకుపోయిన చెత్తను ఆదివారం తొలిగించారు. ఆ ప్రాంతంలో దుర్వాసన రాకుండా శుభ్రం చేశారు.

ముగిసిన ప్రవచనాలు

ఎంవీపీ కాలనీ: శ్రీ సుదర్శన సీతారామాచార్యులు నేతృత్వంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కు వేదికగా ఈ నెల 26 నుంచి జరుగుతున్న శ్రీ వేంకటేశ్వర వైభవం ప్రవచన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విభీషణ శర్మ వేంకటేశ్వర స్వామి వైభవంపై చివరి రోజు చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం



వాకర్స్ పార్కులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మురళీనగర్ : రోజూ కనీసం అరగంట సేపు నడవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపరచుకోవచ్చని కార్డియాలజిస్టు డాక్టర్ కాశీనాథుని గణేష్ సూచించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని పలు ఆరోగ్య సూచనలు చేశారు. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించుకోవాలన్నారు. మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. 50 ఏళ్లు దాటిన వారు ఏడాదికోసారి ఈసీజీ, ట్రెడ్‌మిల్, 2డీ ఎకో పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పాటించాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ శరీరంలో అసాధారణ మార్పులు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సాధారణ వ్యాధుల నిపుణుడు డాక్టర్ మల్లా అలరింద్ మాట్లాడుతూ ఒత్తిడి తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం చేయాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్వరాజు పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో ఉపాధ్యక్షులు మళ్ల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి చొల్లంగి ప్రసాదరావు, జాలీ వాకర్ నానుపాత్రుని ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు జి.విజయలక్ష్మి, రోణంకి నాగేశ్వరరావు, సబ్బినేని రామమోహనరావు, పెంటకోట శ్రీనివాసరావు, కోన ప్రసాద్ సహకారం అందించారు.

వైభవుడికి కదంబం సమర్పణ



గోదాదేవి అమ్మవారి విగ్రహంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన కదంబం ప్రసాదం సమర్పించారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాలార్చన చేశారు. మేళతాళాల మధ్య వేద మంత్రోచ్ఛరణతో గోదాదేవి అమ్మవారి విగ్రహంతో అర్చకుడు శేషాచార్యులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం తిరుప్పావై సేవా కాలం, విశేష భోగం సమర్పించారు. గోదాదేవి తరుపున శ్రీరంగనాథుడికి 14వ పాశురం విన్నవించారు. అనంతరం వైభవుడికి కదంబం ప్రసాదాన్ని సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మురళీనగర్ రామాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సీతారామచంద్రస్వామికి నిత్య పూజలతో పాటు పాశురం విన్నవించారు.

కల్వర్టుకు మరమ్మతులు



మరమ్మతులు పూర్తి చేసిన కల్వర్టు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధి సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల సాయిబాబా గుడి ముందు రోడ్డుకు జీవీఎంసీ అధికారులు మరమ్మతులు చేశారు. కొద్ది రోజుల క్రితం 'ప్రమాదకరంగా రోడ్డు' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ప్రమాదాలు జరగకుండా శ్లాబ్ వేసి సిమెంట్ పలకలు వేశారు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు స్పందించి చర్యలు చేపట్టడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.